## క్లుప్తంగా

### మట్టిరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



కొరువాడ-డి.అగ్రహారం మార్గంలో మట్టిరోడ్డు దుస్థితి

**కె.కోటపాడు:** కొరువాడ–డి.అగ్రహారం గ్రామాల మధ్య రైవాడ కెనాల్‌ను ఆనుకుని ఉన్న మట్టి రోడ్డు అధ్వానంగా దర్శనమిస్తోంది. ఈ రెండు గ్రామాల మధ్య రెండు కిలోమీటర్ల మట్టిరోడ్డులో పలు చోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గోతులు మరింత పెద్దవయ్యాయి. ద్విచక్ర వాహనదారులు తరచూ ఈ మార్గంలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు లోనవడంతోపాటు, తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రైవాడ కెనాల్ నిర్వహణ పనులు చూసే జీవీఎంసీ అధికారులు మట్టిరోడ్డుకు తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ఘనంగా ఊంజల్ సేవ



ఉయ్యాల సేవలో భక్తులు

**మునగపాక:** మండలంలోని నాగులాపల్లిలో ఆదివా రం రాత్రి ఉయ్యాల సేవ ఘనంగా జరిగింది. వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి పల్లకి కమిటీ ఆధ్వర్యంలో ఉయ్యాల సేవ 7వ వార్షికోత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలాటం, సంగీత లహరి కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీనివాస నామస్మరణతో నాగులాపల్లి మార్మోగింది.

### 15న భక్త చింతామణి పద్య నాటకం ప్రదర్శన

**మునగపాక :** తిమ్మరాజుపేటలో ఈ నెల 15న భక్త చింతామని పద్య నాటక ప్రదర్శన జరుగుతుందని సర్పంచ్ బీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. దుర్గాలమ్మ తల్లి పండగ సందర్భంగా కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయి కళానికేతన్ వెల్ఫేర్ సొసైటీ, బీవీఎ నాయుడు సారధ్యంలో ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. రాత్రి 9 గంటలకు రామాలయం గుడి ఆవరణలో ఏర్పాటు చేసే నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని వారు కోరారు.

### 'వర్గీకరణతో ఉపకులాలు నష్టపోతాయి'

**తుమ్మపాల :** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జరిగితే అనేక ఉపకులాలు నష్టపోతాయని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు బోన గణేష్ అన్నారు. పట్టణంలో సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు వర్గీకరణ విషయాన్ని ఎన్నికల ముందు తెరమీదకి తీసుకొచ్చారన్నారు. వర్గీకరణ గనుక జరిగితే జిల్లాల వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా మాలలంతా కలిసి భవిష్యత్తు తరాల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సియాద్రి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ మోనిటరీ మెంబర్ గంగాధర్ మరియమ్మ, అప్పలరాజు, రాజన బుజ్జిబాబు, తట్టా రాజు, మరువడ ఈశ్వరరావు, పతివాడ నాగభూషణం పాల్గొన్నారు

### క్షతగాత్రునికి ఆర్థిక సాయం అందజేత

**నక్కపల్లి :** గత ఏడాది జాతీయ రహదారిపై సారిపల్లిపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులై మంచానికే పరిమితమైన నక్కపల్లికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు పెదపూడి కిరణ్‌కుమార్ కుటుంబానికి విశాఖపట్నానికి చెందిన స్పందన చేయూత ఫౌండేషన్, మరికొంత మంది మిత్రులు కలిసి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ విజయ్‌కుమార్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆలపాటి సుబ్బారావు చేతుల మీదుగా కిరణ్ కుమార్ కుటుంబానికి రూ.36,500 నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్‌తో పాటు ఆయన భార్య,కుమార్తె కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఆలపాటి సుబ్బారావు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా నక్కపల్లి మండలంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సంవత్సరానికి 50 మందికి స్కాలర్ షిప్పులు అందజేస్తున్నామన్నారు. మహిళలకు టైలరింగ్ నేర్పించి మిషన్‌లు అ ందిస్తున్నామన్నారు.





మాడుగుల: జంపెనలో ఆలస్యంగా దమ్ము చేస్తున్న రైతు



మోటారుతో నీరు తోడి నాట్లు వేస్తున్న రైతులు

# ఖరీఫ్ వరి.. కన్నీటి ఝరి

గత నెలలో జోరు వానలు. వర్షపు నీటితో ముంచెత్తిన నారు మడులు. రైతుల మోముల్లో ఆనందం. పక్షం రోజులు గడిచేసరికే సీన్ రివర్స్. భారీ వర్షాల అనంతరం వేసిన వరి నాట్లు ఇప్పుడు నీరు లేక ఎండిపోయే పరిస్థితి. నారుమడుల సంగతి సరేసరి. వర్షాధారంగా ఖరీఫ్ వరి సాగు చేసే బుచ్చెయ్యపేట, మాడుగుల మండలాల్లో రైతులు సాగునీటి కోసం నానా తిప్పలు పడుతున్నారు. గెడ్డలు, చెరువుల్లో ఉన్న అరకొర నీటిని మోటార్ల సాయంతో పొలాల్లోకి మళ్లించి పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

- మెట్ట ప్రాంతాల్లో నీరు లేక సాగని ఖరీఫ్ సాగు
- బుచ్చెయ్యపేటలో 2,700 ఎకరాలు, మాడుగులలో 2 వేల ఎకరాల్లో పడని నాట్లు
- వరుణుడి కరుణ కోసం ఆశగా నిరీక్షిస్తున్న అన్నదాత



వరి పొలానికి పైపులతో నీరు అందిస్తున్న రైతు

**బుచ్చెయ్యపేట/మాడుగుల:** భారీ వర్షాలు కురిశాయన్న ఆనందం రైతులకు పట్టుమని పదిహేను రోజులు కూడా మిగల్లేదు. వేసవిని తలపిస్తున్న ఎండలకు, సాగునీటి వసతి లేని బుచ్చెయ్యపేట, మాడుగుల మండల రైతులు అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్ వరి నాట్లు వేసేందుకు సాగు నీరు లేక దిగులు చెందుతున్నారు. నారుమడుల్ని కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. రూ.వేలల్లో వెచ్చించి డీజిల్ ఇంజిన్ల ద్వారా ఎక్కడో దూరంగా ఉన్న చెరువులు, చిన్నపాటి గెడ్డల నుంచి పైపుల సాయంతో నీటిని పొలాలకు అందిస్తున్నారు.

**వర్షాధారంగా 80 శాతం సాగు**

ఎర్రవాయి ప్రాంతంగా గుర్తింపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో మెట్ట భూములే ఎక్కువ. గ్రామాల్లో 80 శాతం భూముల్ని వర్షాధారంగానే సాగు చేస్తారు. వర్షం కురిస్తేనే మండలంలోని గ్రామాల్లో పంటలు పండుతాయి. వరుణుడి కరుణ లేకపోతే కరువు కోరల్లో చిక్కాల్సిందే. జోరుగా వర్షాలు కురిసే సమయంలో దాన్ని నిల్వ చేసుకునే వసతుల్లేవు. దీంతో వర్షపు నీరు వారం పదిరోజులతో సరి. వరి ఆకులు వేసి నెల రోజులవుతోంది. దమ్ములకు సరిపడా నీరు లేకపోవడంతో పలు గ్రామాల రైతులు గెడ్డలు, చెరువుల్లో ఉన్న నీటిని డీజిల్ ఇంజిన్ల ద్వారా పొలాలకు తరలించి, దమ్ము పడుతున్నారు. ఇప్పటికే నాట్లు వేసిన చోట నీరు లేక సరిగా చేను ఎదగట్లేదని రైతులు వాపోతున్నారు. ఆగస్టు నెల వచ్చినా ఆశించిన వర్షాల్లేక ఎర్రవాయి ప్రాంతాల్లో 50 శాతానికిపైగా వరి నాట్లు పడలేదు. మండలంలోని 5,500 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణంలో ఇంకా 2,700 ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది.

**మెట్ట ప్రాంతాల్లో నిలిచిన నాట్లు**

మాడుగుల మండలంలోని మెట్ట ప్రాంతాల్లో వరి నాట్లు చాలా ఆలస్యమయ్యాయి. గతంలో జూలై నాటికే వరినాట్లు దాదాపుగా పూర్తయ్యేవి. ఆగస్టు రెండో వారం ముగుస్తున్నా నాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. వరి నారు ముదిరిపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి ఉండదని అన్నదాతలు వాపోతున్నారు. మండలంలో జలాశయాలు, వ్యవసాయ మోటార్ల వసతులున్న చోట మాత్రమే ఖరీఫ్ నాట్లు పూర్తయ్యాయి. మెట్ట భూముల్లో వర్షాల్లేక నాట్లు పడలేదు. ఖరీఫ్ సీజన్లో మండల సాధారణ సాగు విస్తీర్ణం 10 వేల ఎకరాలు. ప్రస్తుతం 8 వేల ఎకరాలకు దగ్గరగా నాట్లు వేశారు. ఇంకా 2 వేల ఎకరాలకు పైగానే నాట్లు వేయాల్సి ఉంది. జూలై రెండో వారంలో వర్షాలు అనుకూలించినా, నారు అందక నాట్లు వేయలేదు. ప్రస్తుతం వరినారు అంది వచ్చిందంటే వర్షాల్లేక నాట్లు వేయలేకపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నెలాఖరు వరకు అనుకూలం**

ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నెల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 5,500 ఎకరాలు. ఇప్పటి వరకు 2,800 ఎకరాల్లో నాట్లు వేశారు. ఇంకా 2,700 ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది. ఈ నెలాఖరు వరకు నాట్లు వేసేందుకు అనుకూలం. అప్పటి వరకు నారును కాపాడుకునేందుకు రైతులకు అవసరమైన సలహాలు అందిస్తున్నాం.

– భాస్కరరావు, వ్యవసాయాధికారి, బుచ్చెయ్యపేట మండలం

## నూతన కార్యవర్గం ఏర్పాటు



క్లబ్ సభ్యులతో అలూరి ఉషారాణి, తిరుపతిరాజు తదితరులు

**అనకాపల్లి :** ఎలియన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షునిగా కడిమిశెట్టి పీవీ స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక న్యూకాలనీ గ్రంధి కన్నయ్య పంతులు హాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో క్లబ్ కార్యదర్శిగా కె.వి.సత్యనారాయణ, కోశాధికారిగా వీవీఎన్కే హరనాథ్, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, పీఎస్వీ రవికుమార్, సహాయ కార్యదర్శిగా పి.శంకర్‌తో పాటు 13 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా వైస్ గవర్నర్ అల్లూరి ఉషారాణి వ్యవహరించారు. నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీసర్ బి.తిరుపతిరాజు మాట్లాడుతూ అనకాపల్లిలో మొదటి సారిగా క్లబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, దీని పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. పట్టణం, మండలంలో క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎం.విశ్వేశ్వరరావు, ఎస్.మహేశ్వరరావు, కె.రాజేశ్వరరావు, కడిమిశెట్టి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

### 29న దుర్గాలమ్మ జాతర



జాతర నిర్వహణపై సమావేశమైన కమిటీ సభ్యులు

**మాడుగుల రూరల్:** మండలంలోని ఎం.కోడూరులో ఈ నెల 29న దుర్గాలమ్మ అమ్మవారి జాతర నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు గ్రామంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం సమావేశమయ్యారు. ఏర్పాట్లపై కూలంకషంగా చర్చించారు. ఈ నెల 21న జాతర చాటింపు, 29న పండగ నిర్వహించేందుకు తీర్మానించారు. సమావేశంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## భిక్షాటన చేస్తున్న బడిఈడు పిల్లలు



శ్రీనూకాంబిక ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్న బడిఈడు పిల్లలు

**తుమ్మపాల :** బడిఈడు పిల్లలు భిక్షాటన చేయడం రోడ్లపై నిత్యం చూస్తూనే ఉంటాం. అలా వచ్చిన నగదుతో కుటుంబానికి సహాయంగా ఉంటారనుకుని అందరం తోచిన చిల్లరి ఇస్తూ పిల్లలను శాశ్వతంగా బిచ్చగాళ్లను చేసేస్తున్నాం. దీంతో పిల్లల భిక్షాటన ఇప్పుడు నేరుగా దేవాలయాల్లోనే సాగుతోంది. ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయంలో బడిఈడు పిల్లలు భిక్షాటన చేస్తూ కనిపిస్తున్నారు. పట్టణం, కశింకోట ప్రాంతాల నుంచి 20 మందికి పైగా బడిఈడు పిల్లలు వివిధ వేషధారణలు, పేర్లు మార్చుకుంటు, అంగవైకల్యం ప్రదర్శిస్తు భిక్షాటన చేస్తు రోజంతా గడిపేస్తున్నారు. అమ్మవారి దర్శనం నిమిత్తం వచ్చిన భక్తుల నుంచి చిల్లరతో పాటు ప్రసాదాలు, భోజనం దొరకడంతో రాత్రి 8 వరకు ఉంటునప్పటికీ పట్టించుకునేవారే లేకుండా పోయారు. దేవాలయంలో ఈవో కార్యాలయం వద్ద నేలపై వరుసగా కూర్చుని భిక్షాటన చేస్తున్న పిల్లలు అధికారులకు కనిపించడం లేదు. కనీసం ల్యాబర్ డిపార్ట్‌మెంట్, విద్యాశాఖ అధికారులైనా దృష్టి సారించి వారి వివరాలు తెలుసుకుని పాఠశాలల్లో చేర్పించాలని భక్తులు కోరుతున్నారు.

### మట్టి గణపతులతోనే పర్యావరణ పరిరక్షణ

**అనకాపల్లి :** మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామనే స్ఫూర్తితో ప్రజలందరూ సహకరించాలని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 8 సంవత్సరాలుగా క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, మొక్కలు నాటే కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.

### బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు



బ్రాండిక్స్ అపెరల్ సిటీలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**అచ్యుతాపురం :** బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. బ్రాండిక్స్ అపెరల్ సిటీ నిర్వహిస్తున్న సామాజిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా నిర్వహించిన 130వ కంటి వైద్య శిబిరానికి 600 మంది విచ్చేయగా వారిలో 400 మందికి పరీక్షలు నిర్వహించి, 245 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.100 మందికి ఉచితంగా మందులు అందజేశారు. 50 మందికి కాటరాక్ట్ సర్జరీ చేసుకోవాలని సూచించారు. శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, భోజన సదుపాయాలు కల్పించారు.

## వరుస చోరీలతో జనం బెంబేలు

ఆలయాలు, ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు

**నాతవరం:** ఇటీవల వరుస చోరీలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం తాండవ రిజర్వాయరు గట్టు దిగువునున్న నల్లకొండమ్మ ఆలయంలో హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. ఈ ఆలయంలో ఏడాది వ్యవధిలో రెండు సార్లు దొంగతనాలు జరిగాయి. నాతవరం పోలీసు స్టేషన్ సమీపంలో రిలయన్స్ సెల్ టవరు బ్యాటరీలు గురువారం రాత్రి దొంగిలించారు. నాతవరం గ్రామస్తులు నిత్యం పూజించే వినాయకుడి గుడి, కోటమ్మ తల్లి ఆలయంలో కూడా చోరీ జరిగింది. వెదురుపల్లి, గునుపూడి, మన్యపురట్ల, డి.యర్రవరం, జిల్లేడుపూడి గ్రామాల్లోని ఆలయాల్లో సైతం తరుచూ చోరీలు జరుగుతున్నాయి. నర్సీపట్నం – తుని మధ్య ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకున్న ఎం.బెన్నవరం గ్రామానికి చెందిన బట్టల వ్యాపారి వంకల రాము ఇంట్లో గత నెల 27న చోరీ జరిగింది. అతని ఇంట్లో ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.30 వేలు పట్టుకుపోయారు. ఈ సంఘటనపై నాతవరం ఎస్ఐ రామారావుతోపాటు క్లూస్, క్రైమ్ టీమ్ బృందాలు సంయుక్తంగా సంఘటన స్థలాన్ని పరిశీలించాయి. నేటికీ ఈ కేసులో ఎటువంటి పురోగతి కనిపించలేదు. రెండు నెలలు క్రితం వెన్నలపాలెం గ్రామానికి చెందిన పోలుపర్తి రమేష్ సాయంత్రం 7 గంటలు సమయంలో నర్సీపట్నం నుంచి ఇంటికి వస్తుండగా ములగపూడి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై ఆటకాయించి అతడి జేబులో సెల్‌ఫోన్, డబ్బులు ఎత్తుకుపోయారు. గతేడాది ఇదే ములగపూడి గ్రామంలో చౌదరి ఇంట్లో చోరీ జరిగింది. వారపు సంతల్లో సెల్‌ఫోన్లు, బైక్‌లు చోరీకి గురవుతూనే ఉంటున్నాయి. ఎనిమిదేళ్ల క్రితం నర్సీపట్నం – తుని మధ్య అర్అండ్‌బీ రోడ్డులో గాంధీనగరం పెడిమికొండ అటవీ ప్రాంతంలో బైక్‌లపై వెళ్లే ప్రయాణికులపై దొంగలు దాడులు చేసేవారు. అప్పట్లో హత్యలు ఈ ప్రాంతంలో జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఆ సమయంలో పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించడంతో అలాంటి సంఘటనలు అప్పట్నుంచి చోటు చేసుకోలేదు. మరలా ఇప్పుడు ఆలయాలు, ఇళ్లలో చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

**దొంగల్ని పట్టుకోవడం ఖాయం**

సీసీ కెమెరాల ఆధారంగా దొంగల్ని గుర్తించి, పట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను విడతలవారీగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి పంపిస్తున్నాం. గ్రామాల్లో, ఆలయాల్లో జరిగిన దొంగతనాలపై ప్రత్యేక దృష్టిసారించి నిందితులను పట్టుకునేందుకు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నాం. కాస్త టైం పట్టినా, నిందితులను పట్టుకోవడం ఖాయం.

– రామారావు, ఎస్ఐ, నాతవరం

## పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైపులైను లీకేజీ మరమ్మతులకు తవ్విన గొయ్యి



మరమ్మతుల అనంతరం మట్టితో పూడ్చిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

**రోలుగుంట:** మండలంలోని ఫ్లోరైడ్ గ్రామాలకు తాగునీరందించే పైప్‌లైన్లకు పలు చోట్ల లీకేజీలు ఏర్పడి, నీరు వృథాగా పోతోంది. దీంతో పూర్తిస్థాయిలో తాగునీరందక బాధిత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఈ నెల 9న సాక్షిలో ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. పైప్‌లైన్లకు లీకేజీ అయిన చోట్ల తవ్వకాలు జరిపి, మరమ్మతులు చేపట్టారు.

15 ఏళ్ల క్రితం మండలంలోని నిండుగొండ, కొవ్వూరు, ఎస్.కొత్తూరు, రాజుపేట, కె.నాయుడుపాలెం తదితర గ్రామాలను ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలుగా గుర్తించారు. ఈ గ్రామాలకు జానకిరాంపురం పంపింగ్ సిస్టం ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పైప్‌లైన్లలో లీకేజీలు ఏర్పడితే ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టే పనుల్ని కాంట్రాక్ట్ ప్రాతిపదికన కేటాయిస్తారు. అయితే రోలుగుంట శివాలయం సమీపంలోను, గ్రంథాలయం రోడ్డులోను ఏర్పడిన లీకులు సరిచేసేందుకు గోతులు తవ్వి, పనులు పూర్తి చేయకుండా అలానే వదిలేశారు. దీంతో లీకేజీలు పెరిగి తాగు నీరు వృథాగా పోతోంది. దీనిపై సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఏఈ రాజు పర్యవేక్షణలో లీకేజీలున్నచోట పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. దీంతో బాధిత గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## స్వీట్‌కార్న్ సాగుకు రైతుల ఆసక్తి



బొట్టవానిపాలెంలో సాగులో ఉన్న స్వీట్‌కార్న్ పంట



కోతదశకు చేరిన స్వీట్‌కార్న్

మండలంలో 60 ఎకరాల్లో స్వీట్‌కార్న్ పంట

**కె.కోటపాడు:** మండలంలోని మెట్టప్రాంత గ్రామాల రైతులు ఖరీఫ్‌లో భాగంగా స్వీట్‌కార్న్(మొక్కజొన్న) పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మూడు నెలల వ్యవధిలో పంట కోత దశకు రానుండటం, మార్కెట్లో కాస్త డిమాండ్ ఉండటంతో పలువురు రైతులు సంప్రదాయ పంటల స్థానంలో స్వీట్‌కార్న్‌వైపు దృష్టి సారిస్తున్నారు. మండలంలోని బొట్టవానిపాలెం, కె.సంతపాలెం, అర్లి, గొల్లలపాలెం, పాతవలస, సూదివలస గ్రామాల రైతులు 60 ఎకరాల్లో స్వీట్‌కార్న్ పంటను సాగు చేస్తున్నారు. పంట సాగు సమయంలో చేపట్టే దుక్కులు, విత్తనాలు, సస్యరక్షణ మందులు, నీటి తడులకు ఎకరానికి రూ.20 వేలు పెట్టుబడి సరిపోతుందని, ఖర్చులు పోనూ ఎకరానికి కనీసం రూ.30 వేలు వరకు ఆదాయం సమకూరుతుందని రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంట కోతదశకు చేరుకుంది. పంటను స్థానికంగా విక్రయించడంతోపాటు విశాఖపట్నం, గాజువాక, విజయనగరం ప్రాంతాల్లోని మార్కెట్లకు తీసుకెళ్లి రైతులు అమ్మకాలు జరుపుతున్నారు. పెట్టుబడి వ్యయం, శ్రమ తక్కువ కావడంతోపాటు, మార్కెట్లో డిమాండ్ ఉండి, ఆదాయం కూడా బాగుండటంతో స్వీట్‌కార్న్ సాగు చేస్తున్నట్లు రైతులు చెప్తున్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వాలాబులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డా.రామచంద్రరావు

**దేవరాపల్లి:** గిరిజన పంచాయతీ వాలాబులో సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుడు డా. బండారు రామచంద్రరావు నేతృత్వంలోని వైద్య బృందం సేవలందించింది. పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాల నుంచి వచ్చిన 78 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి, మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. వైద్య శిబిరంలో సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి, వైద్యులు సందీప్, శ్రీచక్ర, అనూష, నీహారిక, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జి.వెంకటరావు, సంఘమిత్ర సొసైటీ సెక్రటరీ బొంతు మంగపతి, సంఘ సభ్యులు రమణమూర్తి, నారాయణరావు, గోవింద బాబు, కుమార్, వాలాబు ఎంపీపీ పాఠశాల హెచ్ఎం కె.దండుంనాయుడు, దేవరాపల్లి పీహెచ్‌సీ సిబ్బంది పుష్పరాజ్, గోవింద, కృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి కోర్సులతో ఆసరా



మాట్లాడుతున్న అప్పలనాయుడు

**కశింకోట :** మహిళలు ఆర్థికంగా బలపడటానికి టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు దోహదపడతాయని సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో మహిళలు ఏ కార్యక్రమం చేపట్టినా విజయం తథ్యమన్నారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌తో వారి కుటుంబాలకు ఆసరా దొరుకుతుందన్నారు. 40 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి అన్నం శివ రాజశేఖర్, సేవాదళ్ కో–ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యస్వామి, శిక్షకులు నాగమణి, హేమ, కన్వీనర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



జాతీయ జెండాలు అందజేస్తున్న మాఊళ్లో గ్రంథాలయం అధ్యక్షుడు ధనశ్రీను

**మునగపాక:** విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మా ఊళ్లో గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి ధనశ్రీను కోరారు. మండలంలోని మంగళవరప్పేటలో మాఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం దేశభక్తి గీతాలు, స్వాతంత్ర్య దినోత్సవ గీతాలకు సంబంధించి శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు జెండాలు అందజేశారు. ధనశ్రీను మాట్లాడుతూ సెలవు రోజుల్లో పిల్లలు టీవీలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి వారం పిల్లలకు పుస్తకపఠనం, దేశభక్తిపై ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రిటైర్డ్ టీచర్ ప్రసాదరావు, గ్రంథాలయం డైరెక్టర్లు సునీత, కనక, తులసి పాల్గొన్నారు.

### గంగాలమ్మతల్లి గుడికి విరాళం

**మునగపాక :** మూలపేట గంగాలమ్మతల్లి గుడికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. తోటాడకు చెందిన దొడ్డి రమేష్, భవానీ దంపతులు, కుమారులు హర్షవర్ధన్, ఆనంద్‌వర్ధన్ ఆదివారం రూ.50,116 నగదును విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధికి, విస్తరణకు భక్తులు విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.